ఓంశ్రీసాయిరాం

దేశసేవకుండె దేశనాయకుడైన
స్వార్థరహిత సేవ సలుపగలడు
పదవి కోరువాడు పరిశుద్ధ హృదయుడా!
చెప్పరయ్య మీరు ఒప్పుకొనెద.

పవిత్రాత్మస్వరూపులారా!

కర్మయొక్క రహస్యాన్ని చక్కగా గుర్తెరిగిన దేశము ఈ భారతదేశము. కనుకనే, ఈ పవిత్రమైన భూమికి కర్మక్షేత్రమనికూడా పేరు. ఆత్మాభిమానముతో చేసిన కర్మ జీవితమునాదరిస్తుంది. ఈ కర్మయొక్క పవిత్రతను గుర్తించుటకు చిత్తశుద్ధి కావాలి. కర్మ నిరంతరమూ ప్రవహించే నదివంటిది. ఈ కర్మయందు సృష్టియందలి చేతనాచేతనముసన్నియూ పరిభ్రమిస్తున్నవి. కర్మతతాత్వన్ని మనం గుర్తించుటలో అతిశ్రద్ధను వహించాలి. 'కర్మ' అనే పదము అతి చిన్నదిగా గోచరించిననూ దాని అర్థబాహుళ్యము అమోఘంగా, అనంతముగా ఉంటున్నది. ఈ కర్మ హృదయాన్ని విశాలం చేస్తుంది. చైతన్యాన్ని వికసింపచేస్తుంది. ఈ పవిత్రమైన కర్మ అహంకారాన్ని నిర్మూలంగావిస్తుంది. ఆత్మానందాన్ని చేకూరుస్తుంది. కర్మ ఇట్టిది, అట్టిది అని నిర్ణయించుటకు వీలుకాదు. ఈ కర్మకు ఆద్యంతాలు లేవు. కావున, తత్త్వము ఎట్లు అనాదియో ఈ కర్మకూడా అట్లే అనాది. ఎవరు ఎక్కడ ఏ కర్మను ఆచరించిరో ఎవ్వరూ చెప్పలేరు. కనుక, కర్మతత్త్వము అతిరహస్యంగా గుర్తించటానికే వీలవుతుంది. సామాన్యంగా లోకరీతిగా అనగా – ఏదో ఒక పనిచేయటమని అర్థము. కాని, ఇది సరియైన అర్థముకాదు. దీనికి ఒక చిన్న ఉదాహరణము. 'అతను ఏమి చేస్తున్నాడు?' అను ప్రశ్నకు 'అతను వ్రాసుకుంటున్నాడు' అని జవాబు చెప్తాము. ఈ వ్రాసుకోటం ఒక కర్మ కనుకదీనిని మనం కర్మగా భవిస్తున్నాము. మరొక ప్రశ్న. 'అతడు ఏమి చేస్తున్నాడు?' 'అతడు ఏమీ చేయటం లేదు. చూస్తున్నాడు' అని జవాబు చెప్తాము. కానీ, అతడు చూస్తున్నాడు. చూచుట అనే పనిచేస్తున్నాడు. కనుక, చూచుట ఒక కర్మ. నిద్రించుట ఒక కర్మ. ఊరక యోచించుట ఒక కర్మయే. మానవునియందు ఉచ్ఛ్వాసనిశ్వాసములుండినంత వరకు క్మాచరణ తప్పదు. కర్మను విసర్జించుటకు వీలులేదు. మానవుని ఉచ్ఛ్వాసనిశ్వాసములుకూడా ఒక కర్మయే. మన ఉచ్ఛ్వాసనిశ్వాసములు ఎట్టి ప్రయత్నములేక కర్మ సాగిపోతుంటుంది. దీనికి ప్రత్యేక పరిశ్రమ చేయనక్కరలేదు. అటులనే మన నిత్యజీవితములో రాత్రి పరుండునంతవరకు ఏవిధమైన పరిశ్రమ అనవసరం. కనుకనే, ఈ కర్మలన్నియూ జీవితమునకు అంకితమైనవి. ఇవి పరమార్థికమునకు చెందినవికావు. ఈ కర్మలలోని నిష్కామ కర్మను మనం చేపట్టాలి. వ్యక్తులకు సేవచేయటం, ఆస్పత్రులలో రోగులకు సేవచేయటం, దీనులకు దిక్కులేని వారికి సహాయము చేయటము, నారాయణ సేవచేయటము ఇవన్నియూ మన జీవితములో అంకితమైన సామాన్య కర్మలు. ఇవన్నియూ నిష్కమ కర్మకు సంబంధించినవి కావు. మానవుడు ఈ ప్రపంచమును స్వార్థం నిమిత్తమూ ప్రేమిస్తున్నాడు. ప్రతి పదార్థాన్ని స్వప్రయోజన నిమిత్తమై ప్రేమిస్తున్నాడు. ఒక ఉదాహరణ. ఒక పండును మనం ప్రేమిస్తున్నామంటే పండునిమిత్తమై ప్రేమించటం లేదు. తన నిమిత్తము పండును ప్రేమిస్తున్నాడు. ఒక పదార్థాన్ని మనం అతి భద్రంగా దాచిపెట్టుకున్నామంటే ఆ పదార్థముయొక్క ప్రేమకోసం కాదు. మన ప్రేమకోసమై, పదార్థాన్ని భద్రపరుస్తున్నాము. కనుక, ప్రపంచంలో అన్నిరకములైన ప్రేమలుకూడా స్వప్రయోజన నిమిత్తమైన ప్రేమలు తప్ప, యదార్థమైన ప్రేమలు కావు. కనుక, ఈ స్వప్రయోజనమైన తత్త్వాన్ని విసర్జించి, ప్రయోజనమైన తత్త్వాన్ని మనం వరించటం, స్వార్థరహితమైన సేవనే భావించటం సేవాదళ సభ్యుల ప్రధాన కర్తవ్యం.

మానవుని ప్రతి ఆలోచనకూడా అతని జీవితంలో ఒక ముఖ్యమైన పాత్రను వహిస్తుంది. కనుక, మానవుడు పవిత్రభావములననే హృదయములో ఉంచుకోవాలి. ఎట్టి భావములో అట్టి భవిష్యత్తే రూపొందుతుంది. మానవుడు అనగా భావాల పంట అని అర్థము. కనుకనే, మనము ఈ స్వార్థరహితమైన భావాలు హృదయంలో చేర్చుకొనుటచేత ఇదియే నిష్కామకర్మకు కొంతవరకు పురికొల్పుతుంది. నిష్కామకర్మ మానవునియందలి పశుత్వాన్ని నిర్మూలనచేసి దివ్యత్వాన్ని ప్రసాదిస్తుంది. కేవలము ధ్యాన, జప, భజనాదులవంటి కర్మలకంటే సేవయే పవిత్రమైనది. ఈ ధ్యానము, యోగము, జపము, భజన– స్వార్థము నిమిత్తమై మానసిక శాంతికోసము ఆచరిస్తాము. పుణ్యముకోసము, పరార్థముకోసము ఆచరిస్తాము. ఇవన్నీ స్వార్థానికి సంబంధించినవి. ఇది పదార్థములయొక్క సమ్మిళతము. కానీ, మనం ఆశించవలసినది పరార్థసంయోగము. పరార్థసంయోగ నిమిత్తమై ఆచరించవలసిన కర్మ నిష్కామకర్మ స్వార్థ రహితంగా ఉండాలి. నిష్కమకర్మ ప్రేమయొక్క పరిమళ పుష్పము. ఇట్టి పవిత్రమైన పరిమళం గల పుష్పంగా మన హృదయాన్ని మార్చుకోవాలి. నిష్కమకర్మ అనేదానికి ప్రత్యేకమైన విశిష్టత ఉంది. ఈ నిష్కమకర్మ అనేదానిలో మన తృప్తినిమిత్తమై, సేవలు చేయించుకునే వ్యక్తియొక్క తృప్తి నిమిత్తమై మనం యోచించరాదు. 'నా జన్మయొక్క విశిష్టత ఇది' అనే విశ్వాసంతో ఆచరించాలి. ఈ నిష్కామకర్మ నిమిత్తమై జన్మము ఆవిర్భవించిందని విశ్వసించాలి. ఈ నిష్కమకర్మ మన నరములలో, కండరములలో, హృదయములో ప్రవేశించాలి. ఏదిచేసినా పరమాత్మ పవిత్ర తృప్తి నిమిత్తమై ఆచరిస్తున్నామని, 'సర్వ కర్మలు భగవత్ప్రీత్యర్థం' అని ఆచరించాలి. నేని ఏదో సత్యసాయి సేవాదళము కన్వీనరుగా ఉంటున్నాను. స్టేట్ ప్రెసిండెంటుగా ఉంటున్నాను.

వారు నియమించే నియమాలను నేను ఆచరించాలనే, ఆ నిర్బంధముల గురించి యోచించ వద్దు. మన రూల్సురెగ్యులేషన్స్ విచారణచేయక హృదయ పవిత్రతకై, చిత్తశుద్ధి నిమిత్తమై మనం ఆచరించుటకు ప్రయత్నించాలి. మన సేవాదళముయొక్క చిహ్నమందు 'duty is God' అని వ్రాసి ఉంది. అయితే ప్రతి మానవుడూ, యావత్ ప్రపంచమున డ్యూటీ, డూటీ అనే పదమును మాత్రమే ఉపయోగిస్తున్నాడు. ఈ డ్యూటీ అనే పదంలో ఉన్న అంతరార్థాన్ని గుర్తించటం లేదు. ఈ డ్యూటీ అనే పదానికి ఒక వ్యక్తిగా ఉన్నప్పుడు ఏమాత్రం విలువ ఉండదు. ఒక సమాజము, ఇరువురు వ్యక్తులు ఉన్నప్పుడే డ్యూటీ అనే పదం ప్రయోగించటం అర్థవంతమోతుంది. ఒక సమాజంలో మనం ఉంటున్నామనే అంతరార్థాన్ని గుర్తింపజేసేదే డ్యూటీ. ఈ డ్యూటీని వ్యక్తిగత డ్యూటీగా భావిస్తున్నాము. ఇక్కడ రెండు ముఖ్యమైన పదాలను మనం వివరించాలి.

1. Individual freedom. 2. Fundamental reedom మన జీవితము పుట్టినది మొదలు అంతమయ్యేవరకు మూడు వంతులు మనం ఫండమెంటల్ రేట్‌తోనే జీవిస్తున్నాము. మన జీవితమంతా సమాజములోనే గడుపుతున్నాము. నీకు నీవు ఏనాటికీ స్వతంత్రుడవు కావు, సంఘముతో, వ్యక్తులతో సంబంధబాంధవ్యములను కల్పించుకొనక నీవు ఏకాంతముగా జీవించుటకు వీలుకాదు. నీవు ఏకాకిగా బ్రతుకుటకు వీలుకాదు. కనుక, మనము యావజ్జీవితము సంఘముతో సంబంధబాంధవ్యములను కల్పించుకుంటున్నాము. కనుక, సంఘసేవ నిమిత్తమై మానవత్వము ప్రాప్తించినదికాని కేవలము స్వసేవకై కాదని సేవాదళం సభ్యులు గుర్తించాలి. ఈ ఈ డ్యూటీ అనే పదంలో మరొక అంతరార్థం కలదు. ఎదుటివారి స్వాతంత్ర్యమునకు భంగముకలుగని స్వాతంత్రాన్ని మనం చేపట్టాలి. నా స్వాతంత్ర్యము నాకు కలదని అహంకారియై ఎదుటి వ్యక్తియొక్క స్వాతంత్ర్యానికి భంగము కలిగించటానికి ముందంజ వేసినచో సంఘము నిన్ను శిక్షిస్తుంది. నీ స్వాతంత్ర్యమునకు నీకెంత అధికారము కలదో ఎదుటివ్యక్తికి కూడా అంత అధికారము ఉంటుంది. దీనికి చిన్న ఉదాహరణ. నీకుస్వాతంత్ర్యము కలదుకదాయని ఒక పెద్ద కఱ్ఱ చేతబట్టి పెద్ద రోడ్డుమీద ఇష్టం వచ్చినట్లు త్రిప్పుతుంటూ పోవచ్చు. నీవు కఱ్ఱను త్రిప్పటంలో నీకు ఎంత స్వాతంత్ర్యం ఉన్నదో ఎదుటి ప్రయానం చేస్తున్న వ్యక్తికి ఈ కఱ్ఱను తప్పించుకొనుటలో అంత స్వాతంత్ర్యముంటుంది. ఎదుట వచ్చే వ్యక్తి స్వాతంత్ర్యమునకు భంగం వచ్చేటట్లు నీవు ప్రర్తించినచో సమజంగాని లేక ప్రభుత్వంగాని నిన్ను శిక్షిస్తుంది. కనుక, ఈ డ్యూటీ అనే పదం లోపల మన స్వాతంత్ర్యం, మన అధికారం ఎంత వరకు పరిమిమై ఉంటుందో అదేవిధంగా ఎదుటి వ్యక్తికికూడా అంతే అధికారం ఉంటుంది. నీకు అన్నివిధాలా అధికారము ఉన్నదికదాయని గ్రామాలలో తిరగటానికి వీలుకాదు. అట్టి అధికారం కావాలంటే అరణ్యంలో సంచరించు. సమాజంలో ఉంటుండి అన్నివిధములైన అధికారములు ఉన్నవికదాయని స్వాతంత్ర్యంతో సంచరించటానికి ప్రైమినిష్టరుకు కూడా వీలుకాదు. ఒక పెద్ద రాజ్యాన్ని పరిపాలించే మహారాజుకూడా నేను రాజునుకదాయని స్వాతంత్ర్యముతో సంచరించటానికి వీలుకాదు. రాజునకుకూడ కొన్ని యిబ్బందులు, క్రమశిక్షణ, కొన్ని నియమములు ఉంటున్నాయి. ఒక చిన్న భౌతికమైన రాజ్యమునకు అధికారిగా ఉన్న రాజుకే యిన్ని నియమములుండగా, సర్వలోక శరణ్యుడైన భగవంతునికి ఇంకా ఎన్నో నిబంధనలున్నాయి. దేవుడు ఏమైనా చేయవచ్చును అనటానికి వీలులేదు. తనకుకూడా కొన్ని నియమములు ఉంటున్నాయి. ఒక చిన్న ఉదాహరణ. లోకంలో భక్తులుంటారు. అందులో ఒక భక్తుడు, 'స్వామీ! నేను పెట్టిన విత్తనములు ఎండిపోవుచున్నవి. సకాలవర్షము కురిపించు' అని ప్రార్థిస్తాడు. మరొక భక్తుడు అదే భగవంతుని, 'స్వామీ! నా యింట కళ్యాణము చేయాలని ఆశిస్తున్నాను. ఈ మూడు దినములు వర్షము రాకుండాచేయి' అని ప్రార్థిస్తాడు. ఒక భక్తుడు వర్షం రావాలని, ఇంకొక భక్తుడు వర్షం వద్దని ఆశిస్తున్నారు. ఇందులో భగవంతుని యిక్కట్టులో పెట్టినట్లుంది. అప్పుడు భగవంతుడు చేయాల్సిన పని ఏమిటి? ఇరువురూ భక్తులే! ఇరువురూ తమ స్వార్థాన్ని ఆధారం చేసుకొని ప్రార్థిస్తున్నారు. అయితే, ఇట్టి ప్రార్థనలన్నీ నేరుగా భగవంతుని చేరుతున్నాయా అని ప్రశ్నించాలి.

ఒక రాజ్యానికి అధికారి. పెద్దరాజ్యాన్ని ఒక్క రాజే పరిపాలనచేయుట అతి కష్టము కనుక, కొన్ని శాఖలుగా విభజిస్తాడు. రెవిన్యూ, పోలీస్ ఇట్లు అనేక శాఖలుగా విభజిస్తాడు. ఈవిధంగా విభజించటం వలన ఏ శాఖకు సంబంధించిన ఫైల్సు ఆ శాఖాధికారికే చేరుతాయి. రాజు పెద్ద అధికారి కదాయని అతని దగ్గరకు వెళ్ళవు. ఆయా కాగితములు ఆయా శాఖాధిపతులకే చేరుతాయి. అదేవిధంగా భగవంతుని సృష్టియందుకూడా ఈ పరిపాలనలో అనేక శాఖలుగా విభజింపబడి ఉంటున్నాయి. ఇంద్రుడు, వరుణుడు, రుద్రుడు ఇటువంటి మంత్రులంతా వారివారి శాఖలను వారు పరిపాలన చేస్తారు. అయితే, భగవంతుడు ప్రైమినిష్టరువలె అన్నింటికీ అధికారిగా ఉంటాడు. అతని శాఖ ఏమిటి? ఇతనికి మూడు రకములుగా సంబంధము కలిగిన బ్రాంచి ఉంటుంది. 1. నిష్కామకర్మ. 2.అనంతప్రేమ. 3. నిర్మలచిత్తము. ఈ మూడు మార్గముల ద్వారా వచ్చే ప్రార్థనలన్నీ భగవంతునికి డైరెక్టుగా చేరుతాయి. మిగిలిన ప్రార్థనలన్నీ భగవంతునికి డైరెక్టుగా చేరటానికి వీలుకాదు. కనుక, ఈనాడు మనం డైరెక్టుగా భగవంతుని అనుగ్రహాన్నీ, అనుమతినీ పొందాలంటే ఈ మూడింటిద్వారా పొందటానికి వీలవుతుంది.

ఈ మూడింటియందు నిష్కామకర్మ ప్రధానమైన డిపార్ట్‌మెంటు. ఈ సేవయందు మన సేవాదళ్ సభ్యులు పాల్గొనాలి. మనం సేవాదళ్ సభ్యులని చెప్పుకుంటూ స్వార్థపరమైన సేవలు ఆచరిస్తే భగవంతునికి ద్రోహంచేసినట్లవుతుంది. పేరుకు తగిన ప్రవర్తన మనం చేపట్టాలి. ఈ నిష్కామకర్మ ఆచరించటానికి ప్రప్రథమంగా అహంకారాన్ని భస్మం చేయాలి. ఈ అహంకారం ప్రవేశించినప్పుడు

సేవకు యేమాత్రం అవకాశముండదు. మొట్టమొదట సేవాదళ కార్యవర్గం ముందంజవేయాలి. ఈ నిష్కామ సేవతో హృదయాన్ని వికసింపజేసుకోవాలి. మానవునిలో మానవత్వపు చైతన్యాన్ని వికసింపజేసుకోవాలి. గోకాక్ ఇంతకు ముందే చెప్పాడు, 'మనీషి' అని. ఈ మనీషి అనేదానిని మనం సరిగా వినిపించుకోనప్పుడు, కొంచెము అవక్ష్యముగా పలికినప్పుడు 'మహిషిగా' ఉంటుంది. అనగా మహేశ్వరుని నుండి వచ్చినది మహిషి. ఇది క్రమక్రమంగా మహర్షిగా మారుతుంది. మనీషి పవిత్ర కర్మలనాచరిస్తూ, నిష్కామకర్మలలో పాల్గొన్నప్పుడు ఇతడే మహర్షి అయిపోతాడు. మహర్షి తత్త్వాన్ని చెందింపజేసేది మనిషియొక్క జన్మ. మనము ఈ నిష్కామకర్మ చేస్తూ ప్రవర్తించాలి. నీవు ఏ కర్మచేసినా దాని ఫలితాన్ని ఆశించకూడదు. ఏదో ఒక ఫలితాన్ని లక్ష్యములే ఉంచుకొని ఆ కార్యములో నీవు పాల్గొనకూడదు. నీ జీవిత కర్తవ్యము, ఇది నా విధి అని భావించాలి. ఇట్టి సేవ వలన కలుగు పుణ్యము ఎట్టి తపః శక్తి వలనా కలుగదు. ఈ సేవ మానవులకు సన్నిహిత సంబంధమును కలిగిస్తుంది. ఈ స్నేహమే దైవ సన్నిధికి సరైన రాజబాట. నవవిధ భక్తులలో స్నేహమనే భక్తి దైవముయొక్క స్నేహాన్ని కలిగిస్తుంధి. అర్చనం, వందనం, దాస్యం, స్నేహం, ఆత్మనివేదనం... వీనిలో ఆత్మనివేదనం స్నేహం ప్రక్కనే ఉంది. కనుక, మనం ఈనాడు మానవునియందే స్నేహతత్త్వాన్ని బలపరచుకోలేని వ్యక్తులము మాధవునియందున్న దివ్యత్వాన్ని ఎట్లు గుర్తించగలము! మన సేవ యావత్ ప్రపంచమునంతటినీ ఏకత్వముగా రూపొందించే సంబంధబాంధవ్యమునేర్పరచుతుంది. మీరనుకోవచ్చు, సోదరులవలె జీవిస్తున్నామని. కానీ, ఈ సోదరభావంకూడా నా దృష్టిలో చిన్నస్థాయి. brotherhood of man fatherhood of God. అంటున్నారు. దీనికంటె ఉన్నతమైనది ఉన్నదనే సత్యాన్ని గుర్తించుకోవాలి. ఈ సోదరులుగా ఉన్నవారుకూడా కలహించి, ఆస్తిపాస్తుల నిమిత్తమై ఎన్నో ప్రమాదాలకు గురియైనవారున్నారు. ఒక ఇంటికే నాలుగు తలుపులుతీసే సోదరులు ఉన్నారు. ఈ సోదరభావంకూడా సమాజంలో లేదు. మన సేవాదళం సభ్యులు దీనికంటె ఉన్నతస్థాయి 'ఏకాత్మభావం' కలిగి ఉండాలి. 'ఏకం సత్ విప్రాబహుదా వదన్తి' 'ఏకోహం బహుస్యాం''ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' 'ఈశ్వరః సర్వభూతానాం' 'ఈశావాస్యమిదం సర్వం' – ఈ ఉపనిషద్వాక్యముల అంతరార్థం ఇదే. ఒక్క ఆత్మయే అనేక జీవులలో దేహరూప విభాగంలో అనేకముగా గోచరిస్తున్నదని. ఈ అనేకత్వములోని ఏకత్వమనే సత్యమును ఉపనిషత్తులు ప్రబోధిస్తూ వచ్చాయి. ఏదో ఒకరికి అపకారం చేసి, కీడును కలిగించి, బాధను కలిగిస్తున్నామని ఆనందంగా ఉప్పొంగరాదు. అది ఎవ్వరికీ కాదు. నీకు నీవే చేసుకుంటున్నావు. ఎవరికో సహాయం, మేలు నేను చేస్తున్నానని భావించరాదు. అది నీకు నీవు చేసుకుంటున్నావు. ఏది చేసినా, ఏది చెప్పినా, ఏది తలచినా, అది నీకు నీవే. అంతేగాని పరులకు కాదనే అంతరార్థాన్ని గుర్తించాలి. ఒక చిన్న ఉదాహరణ. all india state convenors conference లో ఒకసారి చెప్పాను. మనం ఏమిచేసినా మనకు మనం చేసుకుంటున్నాము. ఒకనాడు ఒక ఇంటిలో మూడు కప్పుల కాఫీని తయారుచేశారు. అందులో భార్య ఒక కప్పు, భర్త ఒక కప్పు త్రాగితే ఇంకా ఒక కప్పు మిగిలింది. ఈ ఒక్క కప్పు కాఫీని చెరిసగం త్రాగుదామా లేక ఎవరో ఒకరు మాత్రం త్రాగుదామా అని అనుకుంటూ వుండేసమయంలో ఎవరో ఒక స్నేహితుడు వచ్చాడు. అతనికి ఆ కప్పు కాఫీ యిచ్చారు. ఏదో పెద్ద ఉపకారం చేశాను. మా యిద్దరికీ జగడం లేకుండా మేలుచేశానని ఏదో పెద్ద ఉపకారం చేసినట్లు ఆ యజమాని భావించాడు. రెండు నెలు గడిచాయి. మూడవ నెలలో ఆ స్నేహితునితో ఏదో పనివచ్చి ఆ స్నేహితిని ఇంటికి వెళ్ళాడు. ఆ స్నేహితుడు ఆనాడు ఒక కప్పు కాఫీ ఇతనికి యిచ్చాడు. ఇతడు రెండు నెలల క్రిందట అందించిన కాఫీ ఈనాడు తిరిగి వచ్చేసింధి. ఈ రెండు నెలలు ఆ కాపీని తన ఇంఠిలో గ్లాసులో ఉంచిన అది పాడైపోయేది. తన ఇంఠికి వచ్చినప్పుడు ఈ యజమాని ఆ కప్పు కాఫీ యివ్వకపోయిన తిరిగి ఈనాడు కప్పు కాఫీ యిచ్చేవాడు కాదు. అదేవిధముగా ప్రతి కర్మ మనం తెలిసి చేసినా, తెలియక చేసినా మనకు తిరిగి చేరుతుంది. చెడ్డచేసినా, మంచిచేసినా ఏదో ఒక కాలంలో తిరిగి వస్తుంది. కనుక, మంచిచేసి, మంచిని అందుకోటానికి సంసిద్ధులై ఉండాలి. కర్మమునకు కర్మయే మూలకారణము.

కర్మమున బుట్టు జంతువు
కర్మముననె వృద్ధిపొందు, కర్మమున చెడున్
కర్మమె నరులకు దైవము
కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలో.

కనుకనే, నీవు పవిత్రమైన కర్మలయందు, నిష్కామకర్మలు భగవత్ప్రీత్యర్థమనే భావంతో, చిత్తశుద్ధితో చేయటం, అనంతమైన ప్రేమతో, నిర్మలమైన భావంతో ఉండటం– ఈ మూడింటిచేత దైవత్వాన్ని అతిసులభంగా చేరటానికి అవకాశం ఉంటుంది. ఈవిధమైన సేవద్వారా, ఈవిధమైన కర్మలద్వారా దైవాన్ని పొందటానికి, దైవాన్ని చెందటానికి తగిన రాజమార్గం వేసుకోటం సేవాదళ సభ్యులకుగానీ, అధికారులకుగానీ సరియైన మార్గంగా విశ్వసించాలి.

ఈ నిష్కమకర్మ అనేదానిని ప్రత్యేకంగా భగద్గీత విశిష్టమైన మార్గంగా ప్రబోధించింది. కర్మణ్యేవ అధికారస్తేః నీవు కర్మకు మాత్రమే అధికారివిగాని ఫలితానికి కాదు అన్నాడు. భగవంతుడు కర్మఫలప్రదాతకానీ కర్మదాటికాదు. నీవు ఎట్టి కర్మలు ఆచరిస్తావో అట్టి కర్మఫలితాన్ని అందిస్తాడు. నీవు సత్కర్మలు చేయక, ఎన్నివిధముల ప్రార్థించిననూ భగవంతుడు ఆలకించవచ్చుగానీ, ఆ ప్రార్థనలను అభీష్టముచేయటానికి ముందుకురాడు. ఒక చిన్న ఉదాహరణ. మహాభారతమునందు కృష్ణుడు సంక్రాంతి దినమున

ఆనందంగా, ఉల్లాసంగా రాసక్రీడలు జరుపుతున్నాడు. ఆనాడు భారతీయ సాంప్రదాయం ప్రకారం చెఱకు తినటం వాడుక. కారణమేమన సంక్రాంతికి క్రొత్త పంటగా వస్తుంది ఈ చెఱకు. కొంతమంది గోపికలు కృష్ణునికి ఈ చెఱకు అందించారు. కృష్ణుడు లీలగా ఆ చెఱకును తింటున్నాడు. ఆధునిక కాలములోవలె చెఱకు పిప్పిచేసి రసము తీసే మిషన్లు ఆనాడు లేవు. కృష్ణుడు తింటూతింటూ ఉన్నప్పుడు చిటికెన వ్రేలునకు చెఱకు కోసుకొని రక్తపుబొట్టు క్రిందకి కారింది. అనేకమంది గోపికలు, సత్యభామ, రుక్మిణి, జాంబవతి అంతా ఉంటున్నారక్కడ. ఈ సత్యభామకు కొష్ణుని భార్యనని అహంకారం అధికంగా ఉండుటచేత గోపికలను ఇంటికి వెళ్ళి బట్టలను తెమ్మని పంపింది. గోపికలు అయు, ఇటు బట్టల నిమిత్తమై పరుగెడుతున్నారు. ప్రక్కనే ఉన్న ద్రౌపది తన చీరను చించి 'కృష్ణా' అని కట్టుకడుతున్నది. సరే, ఈలోపల కావలసినంత బ్యాడేజస్ వచ్చాయి. అవి కృష్ణునికి నిరుపయోగంగా మారినవి. ఇంతటితో ఆ రోజు జరిగింది. కొంతకాలమైన తరువాత దుష్టులు, దుర్మార్గులు అయిన దుర్యోధన దుశ్శాసనులు ద్రేపదిని అనేకవిధముల హింసించటానికి, పరాభవంచేయటానికి సభకు ఈడ్చుకొని వచ్చారు. ద్రౌపది అనేకవిధములుగా కృష్ణుని 'ద్వారావాసీ! ఆపద్భాంధవా! అనాధరక్షకా!' అని ప్రార్థిస్తూ వచ్చింది. కృష్ణుడు ఇవన్నీ వింటున్నాడు. కాని ఆమకు సహాయం చేయటానికి 'ఈమె చేసిన కర్మ ఏమిటి? ఏమైనా మంటి చేసిందా?' అని యోచించాడు. ఈరకమైన సహాయమునందించుటకు తగిన కర్మ ఇదివరకు ఆచరించిందా? అప్పుడే సహాయంచేయటానికి వీలవుతుంది. ఆనాడు సంక్రాంతి దినమున తన చీరను చేతికి కట్టుకట్టింది. కనుక, ఆమెకు చీరలివ్వటానికి, సరైన ఫలితాన్ని అందివ్వటానికి వీలుంది. అదే చిటికిన వ్రేలును తిప్పాడు. అదే చీర అక్షయంగా వచ్చింది. కనుకనే, మనయొక్క కర్మలకు అధికారులం కావాలి. సత్కర్మలు ఆచరించిన సత్ఫలితాన్ని భగవంతుడు ఇస్తాడు. కనుక, ఆనాడు గోపికలంతా, 'తస్మై నమః కర్మణే' అని మొదట నేను చేసే కర్మకు నమస్కారము అని నమస్కార్చేసి ఆ కర్మను ఆచరించేవారు. ఎందుకనగా, 'నేను దేవునికి నమస్కారంచేసినా, నేను చేసినవి సత్కర్మలు కాకపోతే దేవుడుకూడా అనుగ్రహించడు. సేవలు ఎంతచేసినా కర్మలు సరైనవికానినాడు సరైన ఫలితము రాదు. నా మంచిచెడ్డలకంతకూ నేను చేసిన కర్మలే ఫలితాన్ని అందిస్తాయి' అని కర్మలకు నమస్కారంచేశ్తి వచ్చారు గోపికలు.ఎలాంటి కర్మలు మంచివనగా భగవత్ప్రీత్యర్థం చేసే కర్మలు మంచివి. భగవంతుని ప్రేమనందించే కర్మలు, భగవంతుని ప్రసన్నునిచేసే కర్మలు.

గోకాక్ చెప్పాడు,' bhagavan is the greatest volunteer, bhagavan is the greatest sevadal leader ' అని. కనుకనే ఆ తీడర్ను మీరు ఫాలోచేయాలి. ఎందుకనగా తెల్లవవారి మొదలు రాత్రి వరకు ప్రతి చిన్న కార్యము తాను స్వయంగా చేస్తాడు. భగవాన్గాని, భగవాన్ వాణిగాని – ఈ రెండూ విరుద్ధమైనవికావు. కనుక, స్వామి చేసినట్లు చేయటము, స్వామి చెప్పినట్లు చేయటము, ఇదే భగవంతుని అనుగ్రహమును, సన్నిహితత్వాన్ని కలిగిస్తుంది. ఈవిధంగా చేస్తే మీరు పూర్తిగా స్వామి అనుగ్రహానికి పాత్రులౌతారు. స్వామికి కావలసినది నిష్కామకర్మ. ఫలితం ఆశించకుండా, నాకు పెరు రావాలి, పదవి కావాలి, నా పేరు పెద్ద అక్షరాలతో పేపర్లో పడాలని అనుకోకూడదు. సేవాదళం కార్యవర్గంలో ఎవరెవరికి అభిప్రాయబేధాలు లేకుండా చూచుకోవాలి. వ్యక్తిగతమైన ద్వేషములకు ఏమాత్రం అవకాశము ఉండకూడదు. ఎవరిని నీవు ద్వేషించినా నీ స్వామిని నీవు ద్వేషించిన వాడవౌతావు. తెలిసో తెలియకయో మానవులలో కొన్ని పొరపాట్లు రావచ్చును. past is past, forget the past. జరిగిపోయింది నీవు మరచిపోయి, ఇకనైనా అన్యోన్యతతో, ఆత్మభావంతో, ఏకాత్మసంబంధముచేత ఈ సేవలో పాల్గొనుటచేత మన సత్యసాయి సేవాదళం సభ్యుల కీర్తి ప్రపంచవ్యాప్తమయ్యే అవకాశం ఉంటుంది. నిస్వార్థసేవ అనే ఆదర్శంపైన మన జీవితసౌధాన్ని నిర్మించుకోవాలి. ఈయొక్క ఆదర్శమైన నిష్కామసేవ ద్వారా మీరు ఇంక మిగిలిన ఆదర్శాలన్నీ చేర్చుకుంటారు. దీనినే మీరు లక్ష్యమునందుంచుకొని, దీనినే ఆదర్శంగా ఉంచుకొని మున్ముందు మీరు చేయవలసిన కార్యములలో ముందంజ వేస్తారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.